ఆ యోగిలోని అహంలా మనలోని అహం కూడా మనల్ని మళ్ళీ మళ్ళీ పుట్టి, మళ్ళీ మళ్ళీ చచ్చేలా చేస్తూంటుంది. మనలోని అహాన్ని ప్రయత్నపూర్వకంగా తొలగించుకుంటే కాని, మనం జీవన్మరణ చక్రంనించి విడివడలేము.

## 160. వ్యామోహం

ఓ రోజు అరిషడ్ వర్గాల (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల) అధి దేవతలు తమ స్నేహితుడితో కలిసి అడవికి వెళ్ళి, అక్కడ చాలాకాలంగా తపస్సు చేసుకుంటున్న ఓ సాధువు దగ్గరకి వెళ్ళి మౌనంగా నించున్నారు. వాళ్ళు కొద్దిసేపు అలా వేచి ఉన్నాక ఆ సాధువు లేచి దీర్ఘంగా నిట్టూర్చి పట్టణం వైపు వెళ్ళిపోయాడు. ఆ దేవతలంతా వెంటనే ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు.

ఇదంతా చూసి అర్థం కాని వారి స్నేహితుడు అడిగాడు.

"నాకిది చెప్పండి. చాలాకాలంగా తపస్సులో ఉన్న ఆ సాధువు ఎందుకు ఇంత అకస్మాత్తుగా లేచి పట్టణం వైపు వెళ్ళిపోయాడు? మీరు ఎందుకు ఒకరినొకరు అభినందించుకున్నారు?"

"ఆ సాధువుకి ఇంతకాలానికి సత్యం యొక్క ఓ చిన్న భాగం ఇందాక దొరికింది. దాంతో వెళ్ళిపోయాడు."

"అదేమిటి? సత్యం యొక్క పూర్తి భాగం దొరక్కుండానే ఎందుకు తపస్సులోంచి లేచాడు?"

"ఎందుకంటే అతను మొత్తం దొరికేదాకా వేచి ఉండకుండా శిష్యుల కోసం, భక్తుల కోసం, ఆశ్రమం కోసం, ప్రవచనాలివ్వడం కోసం వ్యామోహంతో పరుగు తీసాడు. అతనికి ఈ విషయంలో మా సహాయం తప్పక లభించింది." నవ్వుతూ జవాబు చెప్పారు అరిషడ్ వర్గాల దేవతలు.